# కేసీఆర్ చెప్పింది చేస్తారు.. చేసిందే చెబుతారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- సీఎం గుండెల నుంచి వచ్చిన పథకాలు..
- గత మ్యానిఫెస్టో వంద శాతం అమలు
- విలేకరుల సమావేశంలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, అక్టోబర్ 16 : ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు అభివృద్ధి, సంక్షేమ రంగాలు రెండు కండ్ల లాంటివని.. సమాజంలో 85 శాతం ఉన్న పేదలకు సంక్షేమ పథకాలు అవసరమని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. సోమవారం ఆయన బాన్సువాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ గత ఎన్నికల మ్యా నిఫెస్టోను వంద శాతం అమలు చేశారన్నారు. ప్రస్తుత పథకాలను అమలు చేస్తూనే నూతన ప్రభుత్వంలో కొత్త పథకాలను ప్రారంభిస్తామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి అధికారంలోకి వస్తామని.. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలన లో పాలకులు ఏనాడూ తెలంగాణ ప్రాంత వాసుల సమస్యలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కానీ సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ చెప్పింది చేస్తారని.. చేసిందే చెబుతారన్నారు. ఆయన ప్రకటించే పథకాలు పేదల గుండెల్లో నుంచి వచ్చినవే అన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపలేదన్నారు. సీఎం కేసీఆర్ లాంటి సమర్థవంతమైన నాయకత్వం ఉంటే అన్ని సాధ్యపడుతాయని అన్నారు.

**కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాల్లో పథకాలు లేవు**

ఇటీవల కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల వేళ ఓట్ల కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ప్రకటిస్తున్నారని తెలిపారు. అసలు బీజేపీ, కాంగ్రెస్‌లు జాతీయ పార్టీలా.. ప్రాంతీయ పార్టీలా చెప్పాలన్నారు. జాతీయ స్థాయిలో ఒక పాలసీ, రాష్ట్ర స్థాయిలో ఒక పాలసీ ఉంటుందా అని ప్రశ్నించారు. కేవలం ప్రజలను మోసం చేసేందుకు ఇష్ట మొచ్చినట్లు హామీలు గుప్పిస్తున్నారన్నారు. కానీ ఆయా పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. మొన్న కర్ణాటకలో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రస్తుతం చేతులెత్తేసిందన్నారు. అదే విధంగా తెలంగాణలో కూడా అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తున్నారని దుయ్యబట్టారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో హామీలను నెరవేర్చి, తెలంగాణలో ప్రకటించాలన్నారు. అధికారంలోకి వస్తామని కలలు కనడం మానుకోవాలన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో తయారు చేసి ప్రకటించాన్నారు. కేసీఆర్‌పై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, ప్రజల ఆశీర్వాదంతో మరోమారు బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ తరపున బీ-ఫామ్ అందించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికీ కాంగ్రెస్ , బీజేపీ పార్టీలకు అభ్యర్థులు లేరన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ షేక్ జుబేర్, సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీధర్, నర్సింహాచారి, శ్రీనివాస్, ముదిరెడ్డి విఠల్ రెడ్డి, వినయ్ కుమార్, బాలకృష్ణ ఉన్నారు.

# మేమంతా పోచారం వెంటే..



పోచారం సురేందర్‌రెడ్డికి తీర్మాన కాపీని అందజేస్తున్న యాదవ సంఘం సభ్యులు

రుద్రూర్, అక్టోబర్ 16 : మండల కేంద్రంలోని యాదవ సంఘానికి చెందిన 55 కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజక వర్గ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డికి అందజేశారు. యాదవ సంఘంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోచారం సరేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఏకగ్రీవ తీర్మానాలే ఇప్పటి వరకు పోచారం చేసిన అభివృద్ధికి నిదర్శనమన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం, ఏడోసారి పోచారం శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.




# బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్



నూత్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ సాధిస్తాం..
- బీఆర్ఎస్‌లో పలువురి చేరిక
- రెండు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర

నందిపేట్/ఆర్మూర్, అక్టోబర్ 16 : సీఎం కేసీఆర్ మాస్టర్ స్ట్రోక్‌తో కాంగ్రెస్, బీజేపీలకు మైండ్ బ్లాక్ అయిందని.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టబోతున్నదని.. అందరి ఆశీస్సులతో తాను మళ్లీ గెలిచి హ్యాట్రిక్ సృష్టించబోతున్నానని జీవన్‌రెడ్డి అన్నారు. 'నమస్తే నవనాథపురం'లో భాగంగా సోమవారం డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి, ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ గ్రామాల్లో ప్రజాశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓటు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మితే ఆగమవుతామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కాదని.. ఇది ప్రజల మ్యానిఫెస్టో అని, ముచ్చటగా మూడోసారి గులాబీ జెండాను రెపరెలాడించే మ్యానిఫెస్టో అన్నారు. తొమ్మిదిన్నరేండ్లుగా ఇచ్చిన హామీలు అమలు చేసి, ఇవ్వని హామీలను కూడా ఆచరణలోకి తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. విజన్, కమిట్‌మెంట్ ఉన్న నాయకుడిగా ఈ హామీలను సైతం 100 శాతం అమలు చేస్తారని ప్రజలు నమ్ముతున్నారన్నారు. అందుకే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రజలు సంబురాల్లో మునిగి తేలుతున్నారని.. ప్రతిపక్షాలు మాత్రం నైరాశ్యంలో మునిగిపోయాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సవితా గణేశ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**కోమట్‌పల్లి ఉపసర్పంచ్ బీఆర్ఎస్‌లో చేరిక**

ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో డొంకేశ్వర్ మండలం కోమట్‌పల్లి గ్రామ ఉపసర్పంచ్ రాజేశ్వర్ రాష్ట్రముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాజేశ్వర్‌కు జీవన్‌రెడ్డి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు గోపు ముత్యం, ఉపసర్పంచులు పాల్గొన్నారు.



ఉపసర్పంచ్ రాజేశ్వర్‌కు గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

